జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 16-09-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 125 పేజీలు: 8 వెల: రూ.7

# పశువుల సంతలో.. కోట్లలో దందా!



✳ కంచిలి వారాంతపు సంతకు ఒడిశా, ఆంధ్రా నుంచి పశువులు ✳ క్రయవిక్రయాల్లో దళారులు చెప్పిందే రేటు ✳ ఇక్కడి నుంచే కబేళాలకు పశువులు ✳ దళారులు,వ్యాపారుల నుంచి కొందరు పోలీసులు, నేతలకు మామూళ్లు ✳ దగ్గరుండి అక్రమ వ్యాపారం పర్యవేక్షిస్తున్న కొందరు పోలీసు అధికారులు, రాజకీయ నేతలు ✳ దందాను నిలదీస్తే బెదిరింపులు

**శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 15 (వార్త):** ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కంచిలిలో ప్రతి శని, ఆదివారం సంత జరుగుతుంది. ఇక్కడకు ఈ రెండు రాష్ట్రాలకు చెందిన పశువులను క్రయవిక్రయాలు చేస్తుంటారు. మూడు దశాబ్దాలుగా ఈ సంత కొనసాగుతోంది. ఇక్కడ దొరకని పశువు అనేది



ఉండదు. ఆవులు, ఎద్దులు, బర్రెలు, మేకలు, కోళ్లు, గొర్రెలు ఇలా అన్ని రకాల పశువులు క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. వారానికి కోట్లలో దందా జరుగుతోంది. కొందరు వ్యాపారులు, దళారుల పెత్తనం ఇక్కడ కనిపిస్తుంది. వారు చెప్పిందే రేటు. విక్రయదారులు సైతం వీరి మాటను కాదని అమ్మకాలు చేయలేరు. వీరికి కొందరు పోలీసులు, రాజకీయ నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. వీరికి ప్రతినెలా మామూళ్లు పెద్ద ఎత్తున దళారులు అందిస్తుంటారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు పశువులు వ్యాన్లలో తరలిపోతుంటాయి. హైదరాబాద్ నుంచి కొందరు ఇక్కడికి వచ్చి దళారులతో కుమ్మక్కై పెద్ద ఎత్తున పశువులను కొనుగోలు చేస్తుంటారు. పశువుల తరలింపులో ఎటువంటి నిబంధనలు పాటించరు. మూగజీవాలను బంధించి కబేళాలకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. పోలీసులు, రాజకీయ నేతల పలుకుబడి ఉన్న వ్యక్తుల హయంలో ఈ దందా జరుగుతుం డడంతో ఎవరూ నిలదీయలేకపోతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే పోలీసుల ద్వారా హెచ్చరికలు చేయిస్తుండడంతో అంతా సైలెంట్‌గా ఉంటున్నారు. పశు సంవర్ధక శాఖ అధికారులకు ఈవిషయం తెలిసినా పెద్ద తలకాయలు ఈ దందాలో ఉండడంతో మనకెందుకులే అన్న ధోరణిలో ఉంటున్నారు. ఇచ్ఛాపురం సర్కిల్ పరిధిలో పోలీసు అధికారులు కొత్తగా బాధ్యతలు తీసుకున్న వారు మొదట్లో సంతకు వెళ్లి



హడావిడి చేస్తుంటారు. ఆ తర్వాత గప్‌చిప్. సంతలో కోట్లలో వ్యాపారం జరుగుతున్న అందుకుతగ్గట్టు మౌలిక సదుపాయాలు ఉండవు. జిల్లా పోలీసు అధికారులు స్పందించి కంచిలి సంతపై ఓ కన్నేస్తే.. ఇక్కడ జరుగుతున్న అక్రమ దందాతో పాటు వెనుకుండి నడిపిస్తున్న వారి బాగోతం బయటపడే అవకాశం ఉంది.

**సంతలో చీకటి కోణంపై.. త్వరలో మరో కథనం**

చీకటి దందాలో పాత్రధారులు, సూత్రధారులు ఎవరు? ఎవరెవరికి ముడుపులు ఎంతెంత అందుతుంది?.. వారి పేర్లతో సహా త్వరలో వార్త కథనం..

# ఒడిశా టు ఆంధ్రా..!



✳ రైలు, బస్సులు, ఇతర వాహనాల్లో గంజాయి తరలింపు ✳ యువతకు పెద్ద మొత్తంలో డబ్బులు ఆశ చూపిస్తున్న మాఫియా ✳ మాఫియా కనుసన్నల్లోనే తరలింపు ✳ జిల్లాలో పెద్దమొత్తంలో పట్టుబడుతున్న గంజాయి ✳ ఇచ్ఛాపురంలో 32 కిలోల గంజాయి స్వాధీనం




**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 15 (వార్త):** ఒడిశాకు చెందిన కొందరు యువతను గంజాయి మాఫియా ఎరగా చేసుకుంటున్నారు. వారికి అధిక మొత్తంలో డబ్బులు ఇచ్చి ఎవరికీ అనుమానం రాకుండా గంజాయిని ఒడిశా నుంచి ఆంధ్రాలోకి తరలిస్తూ కాసులు చేసుకుంటున్నారు. ఎవరైనా పోలీసులకు దొరికితే తమ పేర్లు బయటపడకుండా జాగ్రత్తలు పడుతున్నారు. వారికి బెయిల్ ఇచ్చే పని కూడా మాఫియానే చూసుకుంటుంది. ఒడిశా నుంచి శ్రీకాకుళం జిల్లా మీదుగా ఇతర ప్రాంతాలకు నిత్యం పెద్ద ఎత్తున గంజాయి వివిధ రూపాల్లో తరలిపోతోంది. పోలీసులు దాడులు చేస్తున్నప్పటికీ వారి కన్నుగప్పి మరీ తరలించేస్తున్నారు. రైల్వే పోలీసులు సైతం రైళ్లలో తనిఖీలు విస్తృతం చేశారు. ఈ నెల 14న ఒడిశా నుంచి ఇచ్ఛాపురం మీదుగా కర్ణాటక రాష్ట్రానికి రైలు మార్గంలో సుమారు 11 కిలోలు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని, 10న ఇచ్ఛాపురంలోని పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద ఓ షాపులో విక్రయిస్తున్న 25 కిలోల గంజాయిని ఇచ్ఛాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ నెల 14న ఆమదాలవలసలోని బీఆర్ నగర్ సమీపంలో ఐదుగురు యువకుల నుంచి రెండున్నర కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇక ఈనెల 7న శ్రీకాకుళంలో పొన్నాడ బ్రిడ్జి వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేయగా.. గంజాయి తరలిస్తూ నలుగురు పట్టుబడ్డారు. వాంబేకాలనీ సమీపంలో ఉన్న డచ్ బిల్డింగ్ వద్ద ఐదుగురి నుంచి 17 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గజపతి జిల్లా మోహన బ్లాక్ నుండి గంజాయి తరలిస్తున్న ముగ్గురిని ఆదివారం ఇచ్ఛాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 32 కిలోల గంజాయి పట్టుబడింది. ఇచ్ఛాపురం నుండి ముంబైకి గంజాయి తరలిసుండగా రైల్వే స్టేషన్ వద్ద పట్టుకుని అరెస్టు చేశామని జిల్లా క్రైమ్ ఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం




## శిథిలావస్థలో కూరగాయల దుకాణం



నరసన్నపేట, సెప్టెంబరు 15 (వార్త): నరసన్నపేటలోని కూరగాయల అమ్మే దుకాణాలు శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని ఉపయోగించుకోకుండా, వ్యాపారులు రోడ్ల పైనే వ్యాపారాలు నిర్వహిస్తూ పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు కలిగిస్తూ తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించకపోవడంతో దుకాణ సముదాయాలు నిరుపయోగంగా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని వారు కోరుతున్నారు.

# నాచు నీరే గతి..!

■ ఎస్టీ మాకివలస గ్రామస్థుల ఆవేదన ■ అధికారులు స్పందించాలని వినతి



జలుమూరు మండలం ఎస్టీ మాకివలస గ్రామంలోని సుమారు 45 గిరిజన కుటుంబాలకు తాగునీటిని అందించే ఏకైక బావి ఇది. బావి మొత్తం నాచు చేరి నీరు దుర్గంధభరితంగా తయారైంది. కానీ ఈ నీటినే తాము తాగి బతకాలని, కనీసం మంచినీటి సౌకర్యం కూడా గ్రామ పంచాయతీ కల్పించడం లేదని గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు ముక్త కంఠంతో కోరుతున్నారు.

-జలుమూరు

## 12 అడుగుల కొండచిలువ హతం



పోలాకి, సెప్టెంబరు 15 (వార్త): పోలాకి మండలం మబగాం గ్రామంలో ఆదివారం ఉదయం కొండ చిలువ కలకలం రేపింది. ఆ గ్రామానికి చెందిన రైతు ఆసిరి నాయుడు ఉదయాన్నే జీడి తోటకు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడే పొంచి ఉన్న 12 అడుగుల కొండ చిలువ రైతుపై దాడి చేసింది. అయితే ఆయన చాకచక్యంగా కట్టెతో కొట్టి కొండచిలువను హతమార్చాడు.

# వైద్య శిబిరాలను వినియోగించుకోండి

**-ఎమ్మెల్యే గొండు శంకర్**



గార, సెప్టెంబరు 15(వార్త):అంబటివానిపేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. స్వర్గీయ అంబటి గోవిందరావు సంస్మరణార్థం ఆయన కుటుంబసభ్యులు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ప్రముఖుల జ్ఞాపకార్థం వైద్య శిబిరాలు నిర్వహించడం, గ్రామాల్లోని ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇలాంటి శిబిరాలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో గోవిందరావు కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వినాయక నవరాత్రుల్లో ధర్మాన తేజ



సారవకోట, సెప్టెంబరు 15 (వార్త): కేలవలస గ్రామంలో నిర్వహించిన వినాయక చవితి మహోత్సవాల్లో ఆదివారం తెలుగుదేశం పార్టీ బీసీ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్, కేలవలస సర్పంచ్ చిన్నాల సింహాచలం తదితరులు పాల్గొని స్వామి వారికి పూజలు జరిపారు. వీరి వెంట ఇచ్ఛాపురపు సోమేశ్, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు చల్ల ఆనందరావు, పిళ్లా నందకిషోర్, కుంచి రాము, కర్రి సింహాచలం పాల్గొన్నారు.


# వరద బాధితుల కోసం రూ.37వేల విరాళం




వంగర, సెప్టెంబరు 15(వార్త): విజయవాడ వరదబాధితుల కోసం సంగాం మాజీ సర్పంచ్ బొడ్రోతు శ్రీనివాసరావు రూ37,000 విరాళం అందజేశారు. ఈ మేరకు ఆ బొత్తన్ని జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొత్స వాసుదేవరావునాయుడుకి అందించారు. ఈ నగదును రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు గాని అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఓనెఅగ్రహారం మాజీ సర్పంచ్ ఆవు సూర్యనారాయణ, సంగాం సంగమేశ్వర స్వామి దేవాలయం మాజీ చైర్మన్ బోను ఆనందరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నరసన్నపేటలో తప్పిన పెను ప్రమాదం

నరసన్నపేట, సెప్టెంబరు 15 (వార్త): నరసన్నపేట పట్టణంలోని రామ మందిరం దగ్గర ఆదివారం లగేజ్ ఆటో బోల్తా పడింది. రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి ఆ ఆటో డివైడర్ పైకి దూసుకెళ్లి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



# వినాయక ఉత్సవాల్లో సినీ నటుడు ప్రభాస్ శ్రీను



నరసన్నపేట, సెప్టెంబరు 15 (వార్త): నరసన్నపేటలోని నాయుడు వీధి, కొత్త వీధి కలిసి నిర్వహిస్తున్న వినాయక మహోత్సవాలకు ఆదివారం సినీ నటుడు ప్రభాస్ శ్రీను విచ్చేశారు. స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సోమవారం జరిగే నిమజ్జనోత్సవంలో ఆయన పాలు పంచుకుంటారని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏడాది ఆయన ఆధ్వర్యంలోనే ఈ ఉత్సవాలను చేపట్టడం జరుగుతోందన్నారు.

**ఎమ్మెల్యే బగ్గుతో భేటీ**

నరసన్నపేట శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తిని ఆదివారం ప్రముఖ సినీ నటుడు ప్రభాస్ శ్రీను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఎన్నికల్లో గెలిచినందుకు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేను కలవడం ఎంతో ఆనందంగా ఉందని శ్రీను చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సినీ చలనచిత్ర రంగంలో మరింత అభివృద్ధి పథంలో ముందుకు రావాలని ఆయనను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు



పోలాకి, సెప్టెంబరు 15 (వార్త): వనవిష్ణుపురం గ్రామంలో ఆదివారం గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో ఈ వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని, పశు వైద్యుడు షణ్ముఖరావు తెలిపారు. ముందస్తుగా ప్రతి ఒక్క రైతు తమ పశువులకు తప్పకుండా టీకాలను వేయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పాలిన ప్రసాద్, పశు వైద్య సహాయకులు కె.సాయి కిరణ్ పాల్గొన్నారు.

## అన్న సంతర్పణలో ఎమ్మెల్యే బగ్గు



పోలాకి, సెప్టెంబరు 15 (వార్త): మబగాం గ్రామంలో వినాయక నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఆదివారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అన్న సంతర్పణలో పాల్గొన్నారు. ఆయన వెంట ధర్మాన రామలింగంనాయుడు కాలనీ, నరసన్నపేట హడ్కోకాలనీ వీధి కమిటీ సభ్యులు ఉన్నారు.


## దూడను కాపాడిన పశు వైద్య సహాయకుడు



పోలాకి, సెప్టెంబరు 15 (వార్త): పోలాకి మండలం పిన్నింటిపేట గ్రామానికి చెందిన నెలలు నిండిన ఆవుకు ప్రసవ సమయంలో ఇబ్బంది పడగా, పశు వైద్య సహాయకుడు తగిన చికిత్స అందించి దూడను కాపాడాడు. తన ఆవు ఈత సమయంలో దూడ బయటికి రాకపోవడంతో పాడి రైతు ప్రభాకరరావు ఆందోళన చెందాడు. దీంతో ఆయన పశు వైద్య సహాయకుడు కణితి సాయికిరణ్‌కు శనివారం సాయంత్రం సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన వెంటనే అక్కడకు చేరుకుని, గర్భంలో ఉన్న దూడను డిస్టోకియా పద్ధతి ద్వారా క్షేమంగా బయటికి తీశారు. గర్భం సైజ్ చిన్నదిగా ఉండడంతో ఇలా జరిగింద ని సాయికిరణ్ తెలిపారు.

## అధ్వానంగా రామకృష్ణాపురం రహదారి

కొత్తూరు, సెప్టెంబరు 15 (వార్త): నివగాం నుంచి రామకృష్ణాపురం గ్రామానికి వెళ్లే రహదారి గుంతలతో కూడి వర్షం పడితే రోడ్లు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. రహదారి మధ్యలో పెద్ద, పెద్ద గుంతలతో నీటితో నిండి వాహనదారులు కనీసం వెళ్లే పరిస్థితి కూడా లేదు. అంగూరులో ఇసుక ర్యాంప్‌లో ఇసుకను తీసుకెళ్లే క్రమంలో లారీలు వందలుగా వెళ్లి రావడంతో రోడ్లు పూర్తిగా పోయాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడితే గుంతలలో నీరు ఏర్పడి ప్రమాదకరంగా ఉందని, రహదారిని అభివృద్ధి చేసి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



## ఇది చెరువే!



(జలుమూరు)

జలుమూరు మండలం శ్రీమన్నారాయణ పురంలో ఉన్న చెరువులో పూర్తిగా నాచు చేరి, కలువలతో కమ్మేసింది. ఈ నీటినే స్థానిక ప్రజలు ఉపయో గించాల్సిన పరిస్థితి. కనీసం నీరు ఎక్కడుందో కనిపించలేనంత మురికిగా ఉన్న చెరువులో కొన్నేళ్లుగా ఉపాధి హామీ పనులు నిర్వహించడం విడ్డూరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెరువును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## రూ.2 కోట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమణ

నరసన్నపేట, సెప్టెంబరు15 (వార్త): నరసన్నపేటలోని మార్కెట్ కమిటీ ప్రహరీకి ఆనుకుని ఉన్న గొట్టిపల్లి రెవెన్యూలో సర్వే నంబర్ 172లో అక్రమ నిర్మాణం జరుగుతోంది. దీన్ని గతంలో అధికారులు అడ్డుకున్నారు. అయితే ఇప్పుడు వరుస సెలవులు కావడంతో అధికారులు ఉండరని భావించి ఆక్రమణదారు పనులు వేగవంతం చేశారు. రూ.2 కోట్లకు పైగా విలువ చేసే ఈ స్థలాన్ని ఆక్రమణ నుంచి సంబంధిత అధికారులు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



## ఫార్మసిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రేజేటి



సంతబొమ్మాళి, సెప్టెంబరు 15 (వార్త): జిల్లా ఫార్మసిస్ట్ సంఘం అధ్యక్షుడిగా సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం పీహెచ్‌సీ ఫార్మసిస్టు రేజేటి సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఈ ఎన్నికలు శ్రీకాకుళంలోని జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎన్.కిరణ్‌కుమార్, రాష్ట్ర పరిశీలకులుగా బీఎస్ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బోనెల గోపాల్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. జనరల్ సెక్రెటరీగా కె.మల్లేశ్వరరావు, ట్రెజరర్‌గా వై.ఆదిలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్లుగా పి.శ్యామసుందర్, ధనంజయరావు, వి.శ్రావణి రఘునాథరావు, జాయింట్ సెక్రెటరీలుగా యు.ప్రీతి, పి.శ్రీనివాసరావు, ఎస్.రమేష్, ఎల్. రామారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ మూడేళ్ల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి, ఫార్మసీ ఆఫీసర్స్ వృత్తి నైపుణ్యం పెంపొందించడానికి కృషి చేస్తామని తెలిపారు. తనకు అవకాశం కల్పించిన జిల్లా, రాష్ట్ర ఫార్మసిస్ట్ సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సోంపేట, సెప్టెంబరు 15 (వార్త): పలాసపురంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో మందస మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీం ప్రథమ స్థానములో నిలిచింది. ద్వితీయ స్థానంలో హరిపురం, మూడవ స్థానంలో ప్రభుత్వ హైస్కూల్ కవిటీ నిలిచాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బెందాళం, వెంకటరమణ, స్థానిక పెద్దలు బెందాళం కృష్ణారావు, రఘునాథ్ పాణిగ్రాహి, నవీన్ కుమార్ పాణిగ్రాహి, బందారం శ్రీను, గార వేణు, బల్లెడ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో 66 టీములు పాల్గొనగా, స్క్రీనింగ్ టెస్ట్‌లో పది టీములు నిలిచాయి.

### ఎర్రముక్కాం విద్యార్థుల ప్రతిభ

సోంపేట మండలం ఎకువూరు మత్స్యకార గ్రామంలో గణేష్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ఎర్రముక్కాం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో 43 వరకు టీములు పాల్గొన్నాయి. ఈ పాఠశాల విద్యార్థులు భర్తు నిఖిల్, తిరుమల పొట్టి కీర్తి, బి.స్వాతి, ద్వితీయ స్థానంలో నిలిచి పాఠశాలకు గుర్తింపు తెచ్చారని హెచ్‌ఎం అనంత, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు తోట, యాదవరావు అభినందించారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రహదారి సమస్యను పరిష్కరించరూ..!



నరసన్నపేట, సెప్టెంబరు 15 (వార్త): ఉర్లాం గ్రామంలోని సాయివీధి నుంచి ప్రధాన రహదారిని కలిపే రహదారి కొంతమేర భూమిలోకి కుంగిపోయింది. ఈ రహదారిపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందికరంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

# చెరువులో పిచ్చిమొక్కలు

- తొలగించాలని బైరాగిపేట వాసుల విన్నపం



(జలుమూరు)

జలుమూరు మండలం బైరాగిపేట గ్రామంలో ఉన్న చెరువు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండి ఉపయోగానికి పనికి రాకుండా ఉంది. గ్రామస్తులు వారి అవసరాలకు ఈ చెరువు మీదే ఆధారపడి ఉన్నామని, ప్రస్తుత పరిస్థితుల్లో కనీ సం చెరువులోకి దిగేందుకు కూడా అనుకూలంగా లేదని వాపోతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి సంవత్సరము ఉపాధి హామీ పేరుతో ఈ చెరువులో పనులు చేపడుతున్నట్లు తెలియజేశారు.



# ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- జనసేన నాయకులు, ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ - నగరంలోని హయాతినగరంలో రెల్లివీధిలో ఘనంగా ర్యాలీ
- మంగళ వాయిద్యాలు, పూలతో ఊరేగింపు - అడుగడుగునా మంగళ హారతులతో మహిళలు స్వాగతం
- ఆనందంతో డాక్టర్ వెంట అడుగులు వేసిన చిన్నారులు - వినాయక మండపాల్లోనూ, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం, సెప్టెంబరు 15 (వార్త): వారంతా రోజు వారీ కూలీలు... కాయకష్టం చేసుకుని కడుపు నింపుకునే శ్రమజీవులు... తమ అభిమాన నాయకుడి రాక కోసం ఆదివారం రోడ్లపై బారులు తీరారు. మంగళ వాయిద్యాలు, డప్పులు, పూలతో ఘున స్వాగతం పలికారు. మంగళ హారతులు పట్టి... నుదుటన తిలకాలు దిద్దారు. జయహో డాక్టర్ సార్ అంటూ జయజయధ్వనాలు పలికారు. జనసేన నాయకులు, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ దానేటి శ్రీధర్‌పై హయాతి నగరం రెల్లివీధి వాసులు పలికిన ఘన స్వాగతం, ర్యాలీలో కురిపించిన పూల వర్షం డాక్టర్‌పై వారికున్న అభిమానానికి అద్దం పడుతుంది.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఐకమత్యం నిర్వహించే ఏ కార్యక్రమం అయినా విజయం సాధిస్తుందని జనసేన నాయకులు, ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని హయాతినగరం రెల్లివీధిలో యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఆయన దర్శించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు వీధి వాసులంతా మంగళవాయిద్యాలు, డప్పులతో ఘన స్వాగతం పలికి ఆయనపై అభిమాన పూల వర్షం కురిపించారు. ముందుగా వీధిలోని దుర్గా, నొకరొ అమ్మవార్లకు డాక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అటు తరువాత మహిళలంతా మంగళ హారతులు పట్టి జై డాక్టర్ సార్, జై జనసేన, జై పవన్ కళ్యాణ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ అందరూ ఐకమత్యంగా ఉంటూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. వినాయకచవితి అన్ని అంతరాలకూ అతీతంగా ప్రజలందరూ పాల్గొనే కార్యక్రమాల పరంపరతో సమైక్యతా స్ఫూర్తి వెలుగులీనుతుందని తెలిపారు. సామాజిక అనుబంధం పరివ్యాప్తమై, నిమజ్జనం వరకు కొనసాగి, అంతటా దీప్తిమంతత వెల్లివిరుస్తుందని చెప్పారు. అనంతరం చిన్నారులతో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ క్రమశిక్షణతో చదువుకోవాలని చెప్పారు. కలలు కనాలని... వాటిని సాధించుకునేందుకు ప్రయత్నించాలని తెలిపారు. చిన్నతనం నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దానిని సాధించుకునే దిశగా ప్రయత్నం చేయాలని చెప్పారు. చదువు వల్లే మనకు సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి కవ్వాడి సుశీల, ఆకుల అప్పారావు, కవ్వాడి రవి, ధనల రమణ, ధనల చిట్టిబాబు, ఆకుల సురేష్, ఆకుల కృష్ణ, ఆకుల మాధవ, ఆకుల శివ, బొమ్మాలి కూర్మారావు ఆకుల రవి, ధనల ఉదయ్యె, వంశీ, రెల్లి వీధి యువత , చిన్నారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భిలాయ్‌లో ఘనంగా హిందీ దివస్



సోంపేట, సెప్టెంబరు 15 (వార్త): భిలాయ్‌లో ఆదివారం ఘనంగా హిందీ దివస్ నిర్వహించారు. బహుమితీయ సామాజిక సంస్థ భిలాయ్ ఛత్తీస్‌గఢ్ ఆంధ్ర స్వాభిమాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలుగు మేధావులు, సభ్యుల సమక్షంలో భిలాయ్‌లోని సెక్టార్-1 అంబేద్కర్‌పార్క్‌లో జాతీయభాష హిందీపై చర్చ, సెమినార్ నిర్వహించారు.

సంస్థ అధ్యక్షుడు కర్రి ఉమాశంకం రావు, గౌరవ సభ్యులు భారతమాత చిత్రపటం ముందు జ్యోతి వెలిగించి, పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన దేశప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందీ భాష ఒక అధు నాతన శాస్త్రీయ సంస్కారవంతమైన భారతీయ భాష అన్నారు. బోధన, అధికారిక వ్యవహారాల్లో ప్రాంతీయ భాషలతో పాటు హిందీ భాష వినియోగం గ్రాఫ్ కూడా క్రమంగా పడిపోవడం ప్రారంభమైందన్నారు.

భిలాయ్‌నగర్ ఎమ్మెల్యే ప్రతినిధి, మాజీ కౌన్సిలర్ గుంటి రాజు మాట్లాడుతూ.. నేడు ప్రపంచంలోనే అత్యుత్తమ హిందీ భాషపై గౌరవం, అభిమానం ఉన్నప్పటికీ మన పిల్లలకు ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో చదువు చెప్పించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. దీనికి ఉపాధికి సంబంధించిన ప్రభుత్వ నియమాలు, విధానాలు ప్రధాన కారణమన్నారు.

గౌరవ వక్తలు వడ్డి అప్పారావు, ఎం.ఎస్.రావు, అంబటి జగన్నాథ్, డి.టి.రెడ్డి, పి.రవికుమార్, ఎన్.భాస్కర్ రావు, పి.చంద్రశేఖర్, కర్రి ప్రసాద రావు, దాసరి శంకరరావు, సి.హెచ్. అప్పలస్వామి, మెయిలపల్లి లోకేష్, సీతారాం ప్రసంగిస్తూ దేశ సమైక్యత, సమగ్రత కోసం ఆత్మగౌరవాన్ని కలిగి ఉండేందుకు జాతీయ భాష ఎప్పుడూ స్ఫూర్తినిస్తుందన్నారు. విదేశీ భాషల వాడకాన్ని ఆపి స్వదేశీ భాషల్లో విద్యా సంస్థలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

కార్యక్రమాన్ని సీనియర్ సభ్యులు జి.మాధవరావు నిర్వహించి, హిందీకి సంబంధించిన పలు అంశాలు, చరిత్ర, అభివృద్ధి, అభ్యున్నతికి సంబంధించిన పలు సమాచారాన్ని అందించారు.

# ఎన్‌టీఆర్ ఇళ్ల బిల్లులకు మోక్షం

- ఐదేళ్ల అనంతరం చెల్లింపునకు ప్రభుత్వం చర్యలు
- లబ్ధిదారుల వివరాలు సేకరణ



(వంగర)

జిల్లాలో ఐదేళ్ళ తరువాత ఎన్‌టీఆర్ ఇళ్లకు మోక్షం లభిస్తుందని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఎన్టీఆర్ ఇళ్లకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. నాడు 2016 నుంచి 2019 వరకూ బకాయి పడిన ఇళ్లకు బిల్లులు చెల్లించటానికి ముఖ్యమంత్రి చంద్ర బాబు అంగీకరించారు. త్వరలో నాటి ఇళ్లకు బిల్లులు మంజూరయ్యే అవకా శం ఉంది. ఇప్పటికే న్ని జిల్లాల నుంచి ఈ మేరకు ప్రభుత్వానికి నివేదికలు వెళ్లాయి.

విజయనగరం జిల్లాలో 5,186 కాలనీ ఇళ్లకు లబ్ధిదారులకు సుమా రుగారూ.15.52 కోట్ల వరకూ బిల్లులు అందనున్నాయి. అందితే నిరుపేద లబ్ధి దారుల అప్పులబాధల నుంచి ఉపశమ నం కలుగుతుందని లబ్ధిదారులు తెలి పారు. ఏ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటికీ గత ప్రభుత్వం చేపట్టిన పథ కాలు కొనసాగించటం ఆనవాయితీగా చెప్పాలి. గత ప్రభుత్వం ఇందుకు అనుగుణంగా పథకాలన్నింటి నిలిపి వేసిందని చెప్పక తప్పదు. ఆ కోవకే చెందింది ఎన్‌టీఆర్ హౌసింగ్ పథకం కూడా. 2019 అసెంబ్లీ ఎన్నికల సమీ పించేసరికి అనేక ఇళ్ల బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. నాటి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ను వీటిని పట్టించుకోవటం లేదన్నది చెప్పాలి. 2016-19 మధ్య చేపట్టిన ఇళ్లకు కారణాలు చూపి పెండింగ్ బిల్లులు చెల్లించలేదన్న ఆరోపణలు న్నాయి. దీంతో గత ఐదారు సంవత్స రాలుగా నిరుపేద కాలనీ లబ్ధిదారులకు ఇంతవరకూ ఎదురు చూపులు తప్ప లేదు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావడంతో, నాడు గతంలో టీడీపీ హయాంలో నిర్మాణం చేపట్టిన ఇల్ల బిల్లులు చెల్లింపులకు కసరత్తు మొద లైనట్లు సంబంధిత అధికారుల సమా చారం. నాడు నిర్మించిన ఇళ్ల బిల్లులు చెల్లింపులుచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. ఈ మేరకు చూసుకొంటే ఈ జిల్లాలో 5,186 ఇళ్లకు సంబంధించి రూ.15.52కోట్లుచెల్లించవలసి ఉంటుందని ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. దీంతో నాడు లబ్ధిదారులు నిర్మించిన ఇళ్లను సంబంధిత అధికారులు పరిశీలించిన అనంతరం బిల్లులు లబ్ధిదారుల అకౌంట్లో జమ కానున్నట్లు సమాచా రం. దీంతో కాలనీ ఇళ్ల లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. 2014లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గృహ నిర్మాణ పథకాన్ని ప్రకటించిన నేపథ్యంలో గ్రామాల్లో ఇళ్లు మంజూరు చేయటం, నిర్మాణాలు ప్రారంభయ్యాయి. ప్రభుత్వంఅధికారం లో ఉన్నంత వరకు బిల్లులు చెల్లించారు. 2018-19లో మంజూరైన పలు పథకాల ఇల్లుకు బిల్లులు చెల్లింపుల్లో కొంతమేర ఆలస్యం కావటం, ఇంతలో ఎన్నికల షెడ్యూలు, నోటిఫికేషన్ రావటంతో బిల్లులు చెల్లింపులు నిలిచి పోయాయి. తదుపరి వైసీపీ అధికారంలోకి రావటం ఈ పెండింగ్ బిల్లులకు పూర్తిగా పక్కన పెట్టేశారు. అప్పటి నుంచి లబ్ధిదారులు బిల్లులు కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఐదేళ్ల అనంతరం మరలా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో నాటి ఆ బిల్లులకు మోక్షం కలిగిందని చెప్పాలి. జిల్లాలో మొత్తం నాటి పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిన ఇళ్లు రాజాం నియోజక వర్గంలో పరిధిలో గల వంగర, సంతకవిటి, రాజాం రూరల్, రాజాం అర్బన్ మండలాల్లో గల 531 ఇళ్లకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇందులో ఒక్క వంగర మండలానికే సంబంధించి సుమారుగా 260 ఇళ్లకు బిల్లులు చేల్లించాల్సి ఉంది. అంతేగాకుండా జిల్లాలోని ఇతర 23 మండలాల్లో సుమారుగా 4500 పై చిలుకు ఇళ్లకు బిల్లులు చెల్లించవలసి ఉంటుంది. ఇప్పుడు ఈ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం సత్వరం చర్యలు తీసుకోనుంది.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413